వ్యాస కౌముది



# భాషానువాదంలో శాస్త్రానువాదం

డా.గుంటి రేవతి

భౌతిక ప్రపంచంలోని వస్తువులను తదాధారంగా మానవమేధస్సులో జరిగే ప్రతి క్రియారూపమైన కొన్ని రకాల భాషావిశేషణాలను ప్రత్యేకించిగానీ సామూహికంగానీ మనం కొన్ని సంజ్ఞలతో వ్యవహరిస్తాం. సమాజంలో నివసించే మనుషులు అభిప్రాయాలను ఒకరితో ఒకరు పంచుకోవడానికి భాష ముఖ్యంగా ప్రవర్తిల్లుతుంది. " ఒక మానవ సమాజం కలిసి మెలగటానికి ఊపయోగించుకునే నిర్వాజ వాక్సంకేతాల ప్రక్రియ భాష". భాష అంటే మానవ సమాజంలోని మనుషులు తమ అభిప్రాయాలను, భావాలను, ఒకరికొకరు తెలపడం. భాష అనేది శబ్దార్థాల సమాహారం. సంకేతభాషగా, మౌకికభాషగా అటుపిమ్మట లిఖితభాషగా అభివృద్ధి చెందిన భాష నేడు సాంకేతిక విజ్ఞాన పరంగా కూడా అభివృద్ధిని సాధిస్తున్నది.

మానవ సమాజం యొక్క అవసరాలను అనుభవాలను భాష ప్రతిబింబిస్తుంది. ప్రాచీనకాలం నుండి ఆధునిక కాలం వరకు ఎన్నో మార్పులు వస్తున్నాయి. కాలానుగుణంగా అన్ని రంగాలలోనూ బయటి సమాజం నమూనాలో మన సమాజం అభివృద్ధిచెందేటప్పుడు భాషలో కొరత ఉండటం మనకు కనిపిస్తుంది. ఈకొరతను తీర్చడానికి వేరే భాషల నుండి ఆయా గ్రంథాలను అనువధించుకోవాల్సి ఉంటుంది. విద్యారంగంలో ఉపయోగపడటానికి ఎన్నో శాస్త్రగ్రంథాలను ఇంగ్లీషు నుండి తెలుగు లోకి అనువదించుకోవలసినవసరం చాలా ఉంది. వైజ్ఞానికయుగంలో సమాజం అన్ని రంగాలలో అభివృద్ధిచెందుతున్నది. అన్ని రంగాలలోనూ జరుగుతున్న వైజ్ఞానికాభివృద్ధిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. వివిధ దేశాలలో వివిధ భాషలలో వెలువడుతున్న శాస్త్రవిషయాలను ప్రతి వ్యక్తి చదివి అర్థం చేసుకోవడం చాలా కష్టం. కాబట్టి ప్రపంచ భాషలలో వస్తున్న శాస్త్రవిషయాలను ఎప్పటికప్పుడు అన్ని దేశాలకు వ్యాపింపజేసే సాధనం అనువాదం. కాబట్టి దేశాభివృద్ధికి శాస్త్రగ్రంధాలను అనువధించడం ఎంతో అవసరం.

అనువాదం అంటే ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం ఖచ్చితంగా వివరిస్తే "ఒక భాషలో ఎవరో చెప్పిన లేదా రాసిన విషయాన్ని మరొక భాషలో చెప్పడం లేదా రాయడం". అనువాదాన్ని తర్జుమా అని భాషాంతరీకరణం అని అంటారు. ఆంగ్లంలో Translation అంటారు.

ఇంగ్లీషులో రాతలో అనువాదం చేసే వ్యక్తిని Translator అని, నోటి మాటలను నోటితోనే అనువాదం చేసే వ్యక్తిని Interpreter అని అంటారు. అనువాదం చేసినా, నోటితో అనువాదం చేసినా అనువాదకుడూ అనే అంటారు. వేరే భాషల నుండీ తెలుగులోకి అనువదించటాన్ని తెలుగు చేయడం అని అంటారు. ఆంగ్లంలోకి అనువదించడాన్ని "ఆంగ్లీకరణం" అంటారు.

ఒక భాష నుండి మరొక భాషలోకి అనువాదం చేస్తున్నప్పుడు ఏ భాష నుండి అయితే అనువాదం చేస్తామో ఆ భాషను మూల భాష అనీ , ఏ భాషలోనికి అనువాదం చెస్తామో, దానిని లక్ష్యభాష అని అంటారు. అనువాదం అంటే మూలభాషలో ఉన్న విషయాన్ని లక్ష్యభాష లోకి మార్చడం. ఒక భాషలో ఉన్న విషయాన్ని మరొక భాషలోకి మార్చిరాసే పద్ధతుల గురించి యస్. యస్. నళిని గారు క్రింది విధంగా పేర్కొన్నారు.

1. ఎటువంటి మార్పులు లేకుండా ఉన్నది ఉన్నట్లుగా ఏ పదానికా పదం మార్చిరాయడం.

2. ఉద్దేశ్యము, అర్థము ఏమాత్రం దెబ్బతినకుండా గ్రహించి, ఏ భాషలోకైతే అనువదిస్తున్నామో, ఆ భాషాసంప్రదాయాలను దృష్టిలో ఉంచుకుని వాటికి అనుగుణంగా అనువదించడం.

అనువాదం చేసే వ్యక్తికి రెండుభాషలలోనూ ప్రావీణ్యం కలిగి ఉండాలి. అనువాదకుడూ సామాన్య జనవ్యవహారంలోని పదాలను తెలుసుకోవాలి. అయితే మూల భాషలో ఉన్న భావాన్ని ఖచ్చితంగా, స్పష్టంగా లక్ష్యభాషలో చెప్పాలంటే కొన్ని సమస్యలు ఎదురవుతాయి. ఒక భాషలోని పదాలన్నింటికీ ఖచ్చితమైన, సమానమైన అర్థం గల పదాలు మరొక భాషలో ఉండవు. కొన్ని పదాలు ఉండవచ్చు కానీ అన్ని పదాలు ఏ భాషలోనూ ఉండవు.

ఉదా: అమ్మాయి అందంగా ఉంది.

బొమ్మలాగుంది.

అంటే తెలుగు లో మెచ్చుకోవటం, ప్రశంసించడం అవుతుంది. ఈ వాక్యాల్ని ఇంగ్లీషులోకి అనువదిస్తే She is beautiful, But beautiful like a Statue అని గానీ, like a doll అని గానీ అంటారు.

ఆమె అందంగా ఉంది. కానీ Doll అని అనడంలో 'జీవకళ లేదనే ' నింద స్ఫురిస్తుంది. ఇలాంటి సమస్యలను అనువాదకుడు ఎదుర్కోవలసి వస్తుంది.

మానవుల పరస్పర అవగాహనకు భాష వినిమయానికి అనువాదం తప్పనిసరి. అంతర్జాతీయంగా అన్ని రంగాలలోను మానవుని మేధస్సు అభివృద్ధి చెందడానికి అనువాదం ముఖ్యమైన ఉపకరణం. భిన్న భాషల మధ్య భాషావరోధాలను తొలిగించే సాధనం అనువాదం. అనువాద రంగంలో జరిగే కృషి ఒకవైపు తులనాత్మక సాహిత్య వివేచన కలిగిస్తుంది. మరో వైపు భాషా వికాసానికి తోడ్పడుతుంది.

సాంకేతిక, వైజ్ఞానిక రంగాలకు సంబంధించిన అనువాదాన్ని శాస్త్రానువాదం అంతా భావ వినిమయ సాధనంగా ఉపయోగించే భాషలో కూడా వైజ్ఞానిక పదాలను చూడవచ్చు. ప్రాచీనకాలంలో గద్య పద్య సాహిత్యాలను వెలువరించిన తెలుగుభాష ఈ రోజు వైజ్ఞానిక విషయాలను కూడా తెలియజేసే సామర్థ్యాన్ని కలిగి ఉండటానికి కారణం అనువాదమనే చెప్పాలి.

వైజ్ఞానిక యుగంలో మానవుని జీవితం, విజ్ఞానం ఒక దానితో ఒకటి మిళితమైపోయాయి. మానవుని పురోగాభవృద్ధికి వైజ్ఞానిక విషయాలు సహాయపడుతున్నాయి. ప్రజల అవసరాలను అనుసరించి కొత్త కొత్త విజ్ఞాన సాధనాలు వస్తున్నాయి. కాబట్టి మానవుని మనుగడ అభివృద్ధి విజ్ఞానశాస్త్రంతో ముడిపడి ఉంది. ఇలాంటి విజ్ఞానపు సాధనాలనేవి ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ ఏక కాలంలో సాధింపబడేవి కావు. ఏదో ఒక దేశంలో ఏదో ఒక ప్రాంతం వారికి కలిగే ఆలోచనల చేతనే సాధింపబడతాయి. వారికి కలిగిన ఆలోచన వారి భాషలో మాత్రమే ప్రచురించబడినప్పుడు అవి ప్రపంచంలో అన్ని ప్రాంతాలలో ఉన్న వారికి తెలియాలంటే ఆయా భాషల్లోకి అనువదించాల్సి ఉంటుంది.

శాస్త్రగ్రంథాలను అనువదించుకోవడం ద్వారా ఆయా భాషల్లోని శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని గ్రహించి విజ్ఞానికంగా అభివృద్ధి చెందదానికవకాశం ఉంటుంది. దీని ద్వారా భాష అభివృద్ధి చెందుతుందని చెప్పవచ్చు. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ, వైజ్ఞానిక రంగంలో అనువాదాన్ని సులభతరం చేయడం కోసం యంత్రానువాద పద్ధతిని తెలుగులో పరిచయం చేశారు. రెండో ప్రంచయుద్ధం ముగిసిన తర్వాత కంప్యూటర్ తో పాటు యంత్రానువాద ప్రక్రియ కూడా మన ముందుకు వచ్చింది. భారతదేశంలో దాదాపు దశాబ్దన్నర కాలం నుంచి ఈ పరిశోధన జరుగుతున్నది. తెలుగు లో గత పది సంవత్సరాలుగా అభివృద్ధిపదంలో సాగుతున్నది.

మొట్టమొదటిగా పాశ్చాత్యదేశాలలో యంత్రానువాదం ప్రారంభించబడి, అభివృద్ధి చెందింది. 1988 లో "సెంటర్ ఫర్ ఇంటర్ నేషనల్ కోపరేషన్ ఫర్ కంప్యూటరైజేషన్" అను సంస్థ బహుభాషా యంత్రానువాదాన్ని ప్రారంభించింది. భారతదేశంలో 1980 లో బెంగళూరులో "భారతీయ విజ్ఞాన సంస్థ" ఇంగ్లీషు నుంచి హిందీ అనువాదానికి మొదటిగా శ్రీకారం చుట్టింది.

సాహిత్యానువాదం కంటే శాస్త్రానువాదంను యంత్రం ద్వారా చాలా సులువుగా చేయవచ్చు. సాహిత్యంలో భాషా సౌందర్యం ప్రధానం. ఆనందం ప్రాధాన్యతను కలిగి ఉంటుంది. అలంకారిక శైలికి, చంధస్సుకు, కళాత్మక విలువలకు ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. కాని శాస్త్రానువాదంలో వ్యవహారిక భాషకు ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. భావగ్రహణతో విషయాన్ని స్పష్టంగా వివరిస్తుంది.

యంత్రానువాదంలో మొదట మూలభాషలోని వాక్యాల్లోని పదాలకు సమానమైన అర్థాన్నిచ్చే లక్ష్యభాషా పదాలను నిఘంటు రూపంలో ఇస్తారు. తరువాత వ్యాకరణం ప్రకారం ఆయా లక్ష్యభాషల వాక్యనిర్మాణం, పదబంధాల, పదాల అమరికకు సంబంధించిన సూత్రాలను ఇస్తారు. వీటన్నింటి ఆధారంగా యంత్రం లక్ష్యభాషలోకి అనువాదం చేస్తుంది.

ఉదా: He ate banana

అతడు మామిడి పండు తిన్నాడు.

అనే లక్ష్యభాష అనువాదాన్ని ఇస్తుంది.

యంత్రానువాదానికి శబ్దకోశవనరులు చాలా అవసరం. శబ్దాలు, వాక్యరచన నియమాలు, అర్థ గత నియమాలు, సంజ్ఞానాత్మక నియమాలు ఇవన్నీ యంత్రానువాదానికి సహకరిస్తాయి . భారతీయ భాషల్లో సంస్కృతాన్ని ఆధారంగా చేసుకుని ఈ శబ్దనిర్మాణం జరుగుతుంది. కారకాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. భారతీయ భాషలను దగ్గర చేర్చి మూలసూత్రాలలో సామ్యాన్ని సాధిస్తే యంత్రానువాదరంగంలో భారతదేశం తప్పక విజయాన్ని సాధించగలుగుతుంది.

## ఉపయుక్త గ్రంథసూచి


1. అక్కిరెడ్డి, ఎస్. మరియు నిర్మలాదేవి, పి. మరియు నళిని, జి. 1989. అనువాద సిద్ధాంతాలు. మద్రాసు : సమతా పబ్లికేషన్స్
2. చంద్రభాను రావత్, _______ 1996. 'యంత్రానువాదం (కంప్యూటర్స్), స్ర వంతి ఆగష్టు 1996 సంచిక (పుట-18)
3. నళిని, యస్. యస్. 2009. సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ. హైదరాబాదు : చరితా ఇంప్రెషాన్స్